క్లుప్తంగా

ప్రభుత్వ ఉద్యోగుల క్యాలెండరు ఆవిష్కరణ



తెనాలి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్, తెనాలి తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో తీసుకొచ్చిన 2024 సంవత్సర కాలెండరును బుధవారం తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ ఆవిష్కరించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్, తెనాలి యూనిట్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి కె.సౌజన్య, ఉపాధ్యక్షులు ఎ.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, అసోసియేట్‌అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శాఖ గ్రంథాలయాలకు పోటీ పరీక్షల పుస్తకాలు



తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లోని శాఖ గ్రంథాలయాలకు జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు వచ్చినట్లు గ్రంథాలయ అధికారులు కడియాల సుజాత, బిందు మాధవి బుధవారం తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు గ్రూప్-1, 2 పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం పుస్తకాలు అందజేసినట్లు వెల్లడించారు. ఇండియన్ హిస్టరీ, జియాగ్రఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, తదితర పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

సారూ.. సమస్యలు పరిష్కరించరూ...



తెనాలిఅర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు బుధవారం తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎ.నరసింహారావు, గురవారెడ్డి, సత్యనారాయణ, బాషా, బాపిరెడ్డి, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి అంగన్‌వాడీల సమస్యలు

తెనాలి: ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరికీ వినతిపత్రాలు ఇవ్వాలన్న రాష్ట్ర నాయకత్వం సూచనపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు బుధవారం ప్రదర్శనగా వచ్చిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను పార్టీ కార్యాలయం వద్ద కలిశారు. తమ సమస్యలను విన్నవించుకుని డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీనిచ్చారు. నియోజకవర్గానికి చెందిన వారైనందున తనకూ సానుభూతి ఉందన్నారు. ఏపీఎస్ కుమారి, పి.పావని, అనూరాధ, కె.నాగలక్ష్మి, రంగపుష్ప, కళాధరి, శాంతకుమారి, లావణ్య, రాధకుమారి, హసీనబేగం, ధనలక్ష్మి, సుజాత, రత్నకుమారి, సీపీఎం నాయకులు కె.బాబూప్రసాద్, రైతుసంఘం నాయకులు ములకా శివసాంబిరెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



రేపల్లె రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నానాటికీ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై గ్రామీణులు అవగాహన కలిగి ఉండాలని పోలింగ్ అధికారులు గుర్రం మురళీ, లచ్చి కోటేశ్వరరావులు అన్నారు. మండలంలోని పేటేరు, బేతపూడి సచివాలయ కేంద్రంలో పేటేరు గ్రామప్రజలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)పై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికలలో ఇప్పటికే ఈవీఎంలను ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిందని, దేశమంతటికీ ఇదే విధానంతో ఎన్నికలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఓటర్లు తమకు నచ్చిన వ్యక్తిని ఈవీఎంల ద్వారా ఎన్నుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మిషన్‌ను ఉపయోగించే విధానాన్ని వివరించారు. వీఆర్‌ఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆడుదాం..ఆంధ్రాకు అందరూ రావాలి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పిలుపునిచ్చారు. చెంచుపేటలోని మార్కెట్ యార్డులో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం కింద నిర్వహిస్తున్న వాలీబాల్, క్రికెట్ పోటీలను బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. కొద్దిసేపు వాటిని ఆడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఒత్తిడితో కూడిన విద్యను విద్యార్థులు అభ్యసిస్తున్నారని తెలిపారు. అలాంటి వారికి క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇవి దోహదపడతాయని చెప్పారు. అలాగే ప్రతిభ ఉండి సరైన వేదిక దొరక్క ఇబ్బందులు పడే వారికి ఇది మంచి అవకాశమని తెలిపారు. తమ సత్తాచాటి మంచి గుర్తింపు తెచ్చుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని వివరించారు. అంతేకాకుండా వీటిలో గెలుపొందిన వారికి మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో మంచి నగదు ప్రోత్సాహ బహుమతులు కూడా లభిస్తాయన్నారు. కమిషనర్ ఎం.జశ్వంతరావు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రాను నిర్వహిస్తుందని చెప్పారు. అందరు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి గాయత్రిదేవి, కౌన్సిలర్ షేక్ ఇస్మాయేల్, మెప్మా సీఎంఎం మాధవరావు, ఆర్‌ఐ కుర్రా శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్ కుమార్, అవుతు నగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

-చంద్రబాబు నాయుడు కాలనీలో బుధవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని 23,24 వార్డుల వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు తోక శిరిషా, పెదలంక లక్ష్మి లావణ్యలు ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు కిట్‌లను పంపిణీ చేశారు.



క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్‌లు శిరిషా, లక్ష్మిలావణ్య

క్రీడా స్ఫూర్తి పెంచేలా...

కొల్లిపర: యువతకు క్రీడా స్ఫూర్తి పెంచేలా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తోందని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండలంలో 15 గ్రామ సచివాలయం పరిధిలో రెండువ రోజు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడా పోటీలల్లో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఆయా గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులతో కలసి మండల స్థాయి అధికారలు ప్రారంభిచారు. ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ సచివాలయం పరిధిలో పోటీలలో ప్రతిభావంతున్ని ఎంపిక చేసి వారిని మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సాల్మన్‌ఖాన్, ఝాన్సీలత, పరిపాలనాధికారి ఏవో చంద్రమోహన్, భీమవరపు మధుసూదనరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



బొమ్మువానిపాలెంలో భాగంగా రెండవ రోజు కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

హత్యాయత్నం కేసులో నిందితులకు జైలు

తెనాలిరూరల్: హత్యాయత్నం కేసులో నిందితులకు జైలు శిక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గంగానమ్మపేటకు చెందిన నర్రా కొండరావును 2019లో మద్యం కోసం డబ్బులు అడుగగా ఇవ్వకపోవడంతో రౌడీషీటర్ సరికొండ సూరంరాజు, మరో ఇద్దరు అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఈ కేసులో రాజీకి రావడం లేదని కొండలరావుపై తిరిగి 2021 జనవరిలో సూరంరాజు, అతని మిత్రుడు బాలాజీ రావు పేటకు చెందిన షేక్ ఆదం షఫి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఈ కేసు ప్రస్తుతం విచారణకు రావడంతో సాక్షాధారాలను పరిశీలించిన అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, నిందితులకు రెండేళ్ల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసును టూటౌన్ పోలీసులు నమోదు చేయగా ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కోట రమేష్ బాబునాయుడు వాదించారు.

వివాహిత అదృశ్యం

తెనాలి రూరల్: భార్యాభర్తల మధ్య చోటు చేసుకున్న స్వల్ప వివాదంతో మనస్థాపానికి గురైన మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక నాజర్ పేటకు చెందిన సుజాత బుధవారం ఇంట్లో భర్తతో గొడవ పడింది. ఈ నేపథ్యంలో ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలయాలకు శివముక్కోటి శోభ



ఆంజనేయస్వామికి తమలపాకుల అలంకరణ



గంగానమ్మపేట శివాలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు



మారీస్‌పేట శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆలయంలో రామేశ్వరస్వామి ఊరేగింపు

తెనాలి టౌన్: శివముక్కోటి పర్వదినం సందర్భంగా పట్టణంలోని శివాలయాలు భక్తులతో బుధవారం కిటకిటలాడాయి. భక్తులు భక్తితో ఆలయాల్లో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోస్‌రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మానేపాటి హరిప్రసాద్ దేవస్థానం కమిటీ అధ్యక్షుడు ఎస్.వేణు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు. గంగానమ్మపేటలోని రామేశ్వరస్వామి ఆలయంలో (పాత శివాలయం)లో విశేష పూజలు జరిపారు. అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. రామేశ్వరస్వామివారిని పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మారీస్‌పేటలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనంలో భక్తులు పూజలు జరిపారు. అర్చకులు ఫణికుమార్ పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో ఉన్న ఆంజనేయస్వామివారికి తమలపాకులతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ కమిటి సభ్యులు పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

అంగలకుదురు-గుడివాడ రోడ్డు ఇక సంపూర్ణం

మిగిలిపోయిన రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



గుడివాడ వద్ద ఆరంభమైన రోడ్డు నిర్మాణ పనులు

తెనాలి: రూరల్ మండలం అంగలకుదురు నుంచి కోపల్లె మీదుగా గుడివాడ మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి మధ్యలో మిగిలిపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ముందుగా వెటామిక్స్ వేసి రోలర్‌తో చదును చేపట్టారు. ఆ వెంటనే తారురోడ్డు నిర్మిస్తారు. 120 మీటర్ల పొడరు, 3.75 మీటర్ల వెడల్పు కలిగిన ఈ రోడ్డును రూ.4 లక్షలతో నిర్మిస్తున్నారు. ఇది పూర్తయితే అంగలకుదురు-కోపల్లె-గుడివాడ మధ్య 4.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణం పూర్తయినట్టవుతుంది. అయిదు గ్రామాలనుంచి వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్ యార్డుకు, ఇతర ప్రాంతాలకు వెళ్లటానికి ఈ రహదారి మార్గమే కీలకం. ఆయా గ్రామాలకు నిత్యం ప్రైవేటు పాఠశాలల బస్సులు నిత్యం రెండుపూటలా రాకపోకలు చేస్తుంటాయి. ఇక ఆటోలు, బైక్‌లు మామూలే. ఇంతటి కీలకమైన రహదారి గతంలోనే శిథిలావస్థకు చేరుకుంది. వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా ఉండేది. అటుగా వచ్చే భారీ వాహనాలకు దినదినగండమే. అయినప్పటికీ గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలా లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెనాలి ఎంపీపీగా చేసిన గుడివాడ ఎంపీటీసీ చెన్నుబోయిన శ్రీనివాసరావు ఈ రహదారి గురించి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని అంగలకుదురు- గుడివాడ మధ్య 4 కి.మీ రహదారిని రూ.2 కోట్లతో నిర్మించారు. గుడివాడకు దగ్గర్లో చప్టా దెబ్బతిని రోడ్డు వేసేందుకు అనువుగా లేని కేవలం 120 మీటర్లు మాత్రమే సాధ్యపడలేదు. ఆ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శివకుమార్ మళ్లీ నిధులు మంజూరు చేయించటంతో పనులు ఆరంభించినట్టు శ్రీనివాసరావు వివరించారు.

మహాయజ్ఞానికి అంకురార్పణ

- తెనాలిలో జనవరి 6–12 తేదీల్లో నిర్వహణ
- యజ్ఞశాల నిర్మాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్



యజ్ఞశాల నిర్మాణానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పట్టణంలో నూతన సంవత్సరం జనవరిలో వారంరోజులపాటు చండీసహిత హనుమదీశ్వర మహాయజ్ఞం కార్యకలాపాలకు అంకురార్పణ జరిగింది. బోసు రోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం ఆవరణలో ప్రత్యేకంగా జరిగే మహా యజ్ఞానికి అవసరమైన భారీ యాగశాల నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ బుధవారం ప్రత్యేక పూజలు చేసి, రుత్వికుడు బ్రహ్మశ్రీ రేలంగి ఫణికుమార శర్మ పర్యవేక్షణలో నిర్మాణపనులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మహాయజ్ఞం పోస్టరును ఆర్యవైశ్య ప్రముఖులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జనవరి 6–12వ తేదీల్లో శ్రీవాసవీ అమ్మవారి ప్రాంగణంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్-పుష్ప దంపతులచే శ్రీచండీసహిత హనుమదీశ్వర మహాయజ్ఞం జరగనున్న విషయం తెలిసిందే. ప్రతిరోజూ ఉదయం ఆరు గంటల నుంచి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ, ఎనిమిది గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, విశేష అర్చనలు, హోమాలు నిర్వహిస్తారు. సాయంత్రం ఆరు గంటల నుంచి హనుమత్ సేవకుడు, తొలి సినీ నేపథ్య గాయకుడు స్వర్గీయ ఎంఎస్ రామారావు మనుమడు డాక్టర్ పి.శ్రీనివాస్‌చే సుందరకాండ పారాయణ ఏర్పాటుచేశారు. మహాయజ్ఞానికి ముందురోజు 5వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి పట్టణంలోని రామాలయం నుంచి శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఈ మహత్తర కార్యక్రమానికి భక్తులు హాజరై సీతారామచంద్ర సమేత శ్రీఆంజనేయ స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని ఎమ్మెల్యే శివకుమార్, ఆర్యవైశ్య నేతలు కోరారు. వాసవీ దేవస్థానం కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, శశి గ్రూప్స్ అధినేత వుప్పల వరద రాజులు, ఆర్యవైశ్య సంఘాల కో-ఆర్డినేటర్ మద్దాళి శేషాచలం, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కొల్లా గురునాథ గుప్తా, చుండూరు సాయి, భాస్కరుని లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు తాడిబోయిన రమేష్ పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

తెనాలి రూరల్: భర్త నిత్యం వేధింపులకు గురి చేస్తున్నాడంటూ మహిళ చేసిన ఫిర్యాదు పై పట్టణ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం ఇస్లాం పేటకు చెందిన నాగలక్ష్మిని ఆమె భర్త మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

తెనాలి రూరల్: పట్టణంలోని చినరావూరు ప్రాంతానికి చెందిన యువతి బుధవారం బజారుకని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొడవపడి ఇరువురికి గాయాలు

యడ్లపాడు: మద్యం సేవించే ప్రాంతంలో జరిగిన గొడవ కారణంగా ఇద్దరు గాయపడ్డ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మర్రిపాలెం గ్రామానికి చెందిన కొర్రపాటి ప్రశాంత్, కొమ్మూరి ప్రేమ్‌చంద్‌లు వారి మిత్రులతో కలిసి గ్రామ శివారులోని కొండవీడు కొండల సమీపంలో మంగళవారం మద్యం సేవించేందుకు వెళ్లారు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ప్రశాంత్‌పై ప్రేమ్‌చంద్ చేయి చేసుకున్నాడు. విషయం ప్రశాంత కుటుంబ సభ్యులకు తెలిసి అతని తండ్రి ఏసుబాబు ఊరిలోని చర్చివద్ద ఉన్న ప్రేమ్‌చంద్‌ను ప్రశ్నించడంతో తిరిగి ఏసుబాబుపై కూడా దాడి చేశారు. బాధితులు పోలీసుల్ని ఆశ్రయించారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయండి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ఎమ్మెల్యే శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మహేష్‌రెడ్డి

తెనాలిఅర్బన్: వచ్చే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పిలుపునిచ్చారు. తెనాలి పట్టణ క్లస్టర్-2 యువజన విభాగ అధ్యక్షునిగా నియమితులైన ఉడుముల మహేష్‌రెడ్డి మంగళవారం రాత్రి ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిశారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఎమ్మెల్యే శివకుమార్, మహేష్‌రెడ్డిని పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-1,2 అధ్యక్షులు మద్దాలి శేషాచలం, షేక్ దుబాయ్ బాబు, ఎంపీటీసీ మైలా భాను, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్ కుమార్, శానంపూడి రఘురామిరెడ్డి, బూరెల దుర్గ, ధరణికోట మల్లి, దోత వాసు, సురేష్, కల్లూరి బాలిరెడ్డి, పెరుగు వెంకటేష్, మాదిరెడ్డి శ్రీనివాస రెడ్డి, కీసరి అంజిరెడ్డి, శరత్, కౌషిక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆరుద్రోత్సవం



ప్రత్యేక పూజల్లో కోన రమాదేవి, భక్తులు

బాపట్ల అర్బన్: బాపట్ల ఎస్ఎన్‌పీ అగ్రహారంలో వేంచేసియున్న గంగాపర్వత వర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవాలయంలో రాత్రి లింగోద్భవ కాలంలో ప్రారంభమైన మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అత్యంత విశేషంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశేష అన్నాలంకృతునిగా స్వామివారు దర్శనమిచ్చారు. అనంతరం ఉత్తరద్వార దర్శనంతో భక్తులు బారులుతీరి దర్శించుకున్నారు. గ్రామోత్సవం జరిగింది. పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి సతీమణి రమాదేవి పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు కొల్లిపర ప్రసాద్ స్వామి అత్యద్భుత అలంకారం చేశారు. అర్చకులు గూడూరు చిట్టిబాబు, పంగులూరి కౌండిన్య భువనగిరి వెంకట్, భీమవరపు సురేష్, గూడూరు సాయి వెంకట్, నెమలికంటి హనుమంతరావు, ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణ, వేణు మాధవ్, శిఖరం ఫణిరాజ శర్మ, యల్లాప్రగడ వెంకటరమణ, కృష్ణసాయి పాల్గొన్నారు.

భట్టిప్రోలు: శివ ముక్కోటి (ఆరుద్రోత్సవం) వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రంలో వచ్చే శివముక్కోటి సందర్భంగా శైవ క్షేత్రాలలో ఉత్తర ద్వారదర్శనం అత్యంత వైభవంగా నిర్వహించారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నిజాంపట్నం: అధ్యయనం, అధ్యాపకం సామాజిక స్పృహ అనే నినాదంతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ కృషిచేస్తుందని మండల విద్యాశాఖ అధికారి కె.హరిబాబు తెలిపారు. బుధవారం నిజాంపట్నంలోని మండల విద్యావనరుల కేంద్రంలో యూటీఎఫ్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్, అధ్యాపకదర్శినిలను ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ బాపయ్య, మండల అధ్యక్షుడు కె.రాజేష్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ గణేష్‌రావు, జిల్లా కౌన్సిలర్ నరేష్, ఉమ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కూచినపూడిలో ఇంటింటి సర్వే



సర్వే నిర్వహిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ మురళి, సిబ్బంది

నిజాంపట్నం: చర్మంపై స్పర్శలేని మచ్చలు ఉంటే ఇంటింటి సర్వేచేస్తున్న ఆరోగ్య కార్యకర్తల దృషికి తీసుకురావాలని హెల్త్ సూపర్‌వైజర్ మురళి తెలిపారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా కూచినపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించారు.

ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ చెవులపై, వీపుపై నొప్పిలేని బుడిపెలు ఉన్నా, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం వంటివి, కనురెప్పలు మూతపడకపోవడం, అరచేతులు, అరికాళ్లల్లో స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకర్తల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కుష్ఠువ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం

భట్టిప్రోలు: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం, పద్మావతి శ్రీనివాస భజన మండలి 24వ వార్షికోత్సవం గురువారం భట్టిప్రోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో జరుగుతుందని ఆర్గనైజర్స్ తూనుగుంట్ల చాముండేశ్వరి, కోట సంధ్యారాణి, బూర్లె అరుణ కుమారిలు బుధవారం తెలిపారు. అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారికి తిరుమల తిరుపతి దేవస్థానాలు-తిరుపతి దాస సాహిత్య ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొంటారని తెలిపారు.

రీసర్వే పనులు ప్రారంభం



పిట్టలవానిపాలెం: మండలంలోని పిట్టువారిపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో బుధవారం రీసర్వే పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా జగనన్న భూహక్కు రీసర్వే పనుల్లో భాగంగా డ్రోన్ ద్వారా రీసర్వే పనులను నిర్వహించారు. సర్వేయర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జగనన్న భూహక్కు రీ సర్వే కార్యక్రమం ద్వారా భూహక్కులు కలిగిన రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. గ్రామ సర్పంచ్ యేత్ర అశ్వినిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు యేత్ర శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు.